
మేడ్చల్ డీపీఆర్‌వో బదిలీ

కీసర, ఫిబ్రవరి7: మేడ్చల్ డీపీఆర్‌వో (పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) జె.కిరణ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఐఅండ్‌పీఆర్ అదనపు డైరెక్టర్ హనుమంత్‌రావు బుధవారం ఉతర్వులు జారీ చేశారు. కొంత కాలంగా మేడ్చల్ డీపీఆర్‌వోగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ నాగర్ కర్నూల్‌కు బదిలీపై వెళ్లారు. అదే విధంగా మేడ్చల్ జిల్లా డిప్యూటీ ఎగ్జిగ్యూటీవ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్ నాగాంజలికి డీపీఆర్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

పెళ్లి సందడి

3 నెలలు.. 30 రోజులు మంచి ఘడియలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వివాహాల కోలాహలం ప్రారంభంకానుంది. ఈ నెల 11వ తేదీన మాఘమాసం ప్రారంభమవుతుండటంతో మంచి ముహూర్తాల్లో పెళ్లిళ్లు జరిపించడానికి తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. సుమారు రెండు నెలల విరామం తర్వాత శుభఘడియలు ఉండడంతో కల్యాణ మండపాల వద్ద పెళ్లి బృందాల సందడి మొదలు కానుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో నూతన జంటలు ఒక్కటి కానున్నారు. ఇందుకు అనుగుణంగా వధూవరులు, తల్లిదండ్రులు ముందస్తు పెళ్లి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

శుభ ఘడియలు ఇవే...

మాఘం: ఫిబ్రవరి 13, 14, 17, 18, 24, 27, 28, 29, మార్చి 2, 3 తేదీలు

ఫాల్గుణం: మార్చి 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30, ఏప్రిల్ 3, 4 తేదీలు

చైత్రం: ఏప్రిల్ 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు

ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభం, అక్టోబరు వరకు ముహుర్తాలు లేవు

- ఈ నెల 11నుంచి మాఘమాసం ప్రారంభం
- ఏప్రిల్ 26 వరకు వివాహాల కోలాహలం
- ఆ తర్వాత మూఢం, శూన్యమాసం
- తిరిగి ఆశ్వయుజ మాసంలో ముహూర్తాలు
- ఉమ్మడి జిల్లాలో వేలల్లో జరగనున్న పెళ్లిళ్లు..
- ఒక్కటి కానున్న కొత్త జంటలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 7): మాఘమాసం ఎప్పుడు వస్తుందా.. మంచి ముహూర్తం ఎప్పుడు కుదురుతుందా.. అని నవ వధూవరులు ప్రతీ ఏటా ఎదురు చూస్తుంటారు. ఇక ఆ టైం.. రానే వచ్చేసింది. పెళ్లి బాజా మోగే సమయం ఆసన్నమైంది. ఈనెల 11వ తేదీన మాఘమాసం ప్రారంభమవుతుండటంతో పెళ్లి సందడి మొదలైంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ 26 వరకు మూడు నెలల్లో మంచి ముహూర్తాలున్నాయి. తర్వాత ఏప్రిల్ 28 నుంచి మూఢం ప్రారంభమవుతుంది. దీంతో వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో వివాహ ముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు. తర్వాత ఆశాఢం శూన్య మాసం కావడంతో శుభ కార్యాలకు పనికిరాదు. మళ్లీ ఆశ్వీజం దసరా తర్వాత తిరిగి వివాహాలు జరగనున్నాయి.

ఏప్రిల్ 26 వరకే ముహూర్తాలు

మాఘం, ఫాల్గుణం, చైత్రం ఈ మూడు మాసాలు (ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో) దాదాపు 30వరకు ముహూర్తాలు ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. ఫిబ్రవరి 11న తొలి ముహూర్తం మొదలుకుని ఏప్రిల్ 26వ తేదీ వరకు మంచి ఘడియలున్నాయని ప్రకటించారు.

ఆరు నెలల వరకు ఆగాల్సిందే...

సాధారణంగా మే నెలలో కూడా పెళ్లి ముహూర్తాలు బాగా ఉంటాయి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 26వ తేదీతోనే పెళ్లి ఘడియలు అయిపోతున్నాయి. తర్వాత మూఢం వస్తుంది. దసరా తర్వాత (ఆశ్వయుజం) అక్టోబరు 12 తర్వాత ముహూర్తాలున్నాయి. ఆరు నెలల వరకు పెళ్లి ముహూర్తాలు లేవని పండితులు పేర్కొంటున్నారు.

ఫిబ్రవరి 18వ తేదీ ఆదివారం నవమి, రోహిని నక్షత్రం ఉండటంతో ఆరోజు దివ్యమైన ముహూర్తం ఉంది. ఆరోజు వేల జంటలు ఒక్కటి కానున్నాయి. ఫిబ్రవరి 14వ తేదీన వసంత పంచమి, రేవతి నక్షత్రం ఉంది. మార్చి ఒకటో తేదీ శుక్రవారం శష్ఠి, స్వాతి నక్షత్రం లో, 3వ తేది ఆదివారం అనురాధ నక్షత్రం, 7వ తేది



దివ్యమైన ముహూర్తాలు

గురువారం ఉత్తరాషాఢ నక్షత్రంలో దివ్యమైన ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు అధికంగా జరగనున్నాయి. అలాగే మార్చి 13వ తేదీ ఆశ్వినీ నక్షత్రం, 22వతేదీ శుక్రవారం మగనక్షత్రం, 24 ఆదివారం ఉత్తర నక్షత్రం, 27వ తేదీ బుధవారం చిత్తానక్షత్రం, 28వ తేదీ గురువారం స్వాతి నక్షత్రంలో మంచి ముహూర్తాలున్నాయి.. ఏప్రిల్ 3వ తేదీన ఉత్తరాషాఢ నక్షత్రం, అదే నెలలో చివరి దివ్యమైన ముహూర్తం 4వ తేదీ శ్రవణా నక్షత్రం కావడంతో పెళ్లిళ్లు జరగనున్నాయి.

లీపు సంవత్సరంలో..

లీపు సంవత్సరం నాలుగు సంవత్సరాలకు ఒకసారి అరుదుగా వస్తుంది. ఈ రోజు ఎంతో మందికి ప్రత్యేకం కూడా, సాధారణంగా ప్రతిఏటా క్యాలెండర్‌లో 365 రోజులు ఉంటే.. ఈ ఏడాది మాత్రం 366 రోజులు ఉంటాయి. అందుకే దీనిని లీపు సంవత్సరం అంటున్నాం. ఈరోజు పుట్టిన వారికి నాలుగేళ్లకోసారి బర్త్‌డే సెలబ్రేషన్స్ జరుపుకుంటారు. ఇక ఈ రోజు పెళ్లి చేసుకున్న వారు కూడా అంతే. వారి మ్యారేజ్ యానివర్సరీ నాలుగేళ్లకు వస్తుందన్న మాట. కొంత మంది వధూవరులు లీపు సంవత్సరాన్ని ఎంచుకున్నారు. లీపు సంవత్సరం ఫిబ్రవరి 29న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు.



చేతినిండా పని

వివాహాల శుభఘడియల నేపథ్యంలో అన్ని వర్గాలకు ఉపాధి లభించనుంది. పెళ్లిళ్లు జరిగితే వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. ఫ్లవర్ డెకరేషన్, భజంత్రీలు, వంటమాస్టర్స్, ఫోటో, వీడియోగ్రాఫర్స్, పురోహితులకు మంచి డిమాండ్ ఏర్పడనుంది. వివాహాలు జరుపుకునేందుకు కల్యాణమండపాలు, కన్వెన్షన్ హాల్స్, సత్రాలు, గదులు, క్యాటరింగ్ వంటివి ముందుగానే రిజర్వ్ చేసుకుంటున్నారు. మార్కెట్‌లో ఇప్పటికే వస్త్రాలు, బంగారం, సరుకులు కొనుగోళ్ల సందడి నెలకొంది. పట్టణాల్లో బంగారం షాపులు, వస్త్ర దుకాణాలు రద్దీగా మారాయి.

మూడు నెలల్లో జోరుగా వివాహాలు



ఈ ఏడాది వివిధ కారణాల వల్ల వివాహ ముహూర్తాలు తక్కువగా ఉన్నాయి. ఫిబ్రవరి 11 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకూ ముహూర్తాలు ఉన్నందున వివాహాలు ఎక్కువగానే జరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరి 18న దివ్యమైన ముహూర్తం ఉండటంతో ఆ రోజు నాకు మూడు వివాహాలు బుక్ అయ్యాయి. చేగిరెడ్డి ఘనాపూర్‌లో ఫిబ్రవరి 16, 17, 18 రామాలయం, శివాలయం, ఆంజనేయ స్వామి, ధ్వజ స్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠపనతో పాటు వివాహాలు ఉన్నాయి.

- జోషి రాఘవేందర్‌రావు, పురోహితులు, చేగిరెడ్డి ఘనాపూర్, చౌదరిగూడ

ఆరు పెళ్లిళ్లు బుక్ అయ్యాయి



నాకు డెకరేషనే జీవనాధారం, వివాహాది శుభకార్యాలయాలకు వివిధ డిజైన్‌లో డెకరేషన్ చేస్తారు. ఎక్కువగా మార్చిలో డెకరేషన్ కోసం బుక్ చేసుకున్నారు. షాద్‌నగర్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో ఎవరు పెళ్లి చేసినా డెకరేషన్ నేనే చేస్తాను. మార్చిలో 27, 28, 14, 22, 29, 17, తేదీల్లో డెకరేషన్ కోసం బుక్ చేసుకున్నారు.

- శేఖర్, డెకరేషనిస్టు, కొందుర్గు గ్రామం

గిరాకీ బాగానే ఉంది



ఈసారి పెళ్లిళ్ల గిరాకీ బాగానే ఉంది. ఈ నెల, వచ్చేనెల టెంట్ హౌస్ సామాన్లు బుక్ చేసుకున్నారు. టెంట్ వేసేందుకు కూలీలు దొరకడం లేదు. కూలీ రేట్లు పెంచేశారు. ఈ సారి మేము కూడ టెంట్ల ధరలు 10 శాతం పెంచుతున్నాం. పెళ్లిళ్ల సీజన్‌తో ఉపాధి లభిస్తుంది.

- యం. లక్ష్మయ్య, టెంట్‌హౌస్, మేడిపల్లి

14వ తేదీ ఎక్కువ ఆర్డర్స్ వచ్చాయి



ఈనెల 14వ తేదీ వసంత పంచమి ఉండటం.. ఆ రోజు దివ్యమైన ముహూర్తం ఉండటంతో పెళ్లిళ్లు ఎక్కువగా జరగనున్నాయి. దీంతో పెళ్లి పత్రికలకు ఆర్డర్స్ ఎక్కువ వచ్చాయి. వచ్చే నెలకు సంబంధించి కూడా ఆర్డర్స్ వస్తున్నాయి.

- సంతోష్‌కుమార్ గుప్తా, శ్రీ మణికంఠ ప్రింటర్స్, షాబాద్

ముందే బుక్ చేసుకుంటున్నాం



ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి వివాహాలు ఉండటంతో ముందే గార్డన్‌ను బుక్ చేసుకుంటున్నారు. ప్రస్తుతం మా గార్డెన్‌కు డిమాండ్ పెరిగింది. వదూవరూలకు తగ్గట్టుగా పత్ర్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాము. వివిధ రకాల పూలతో డెకరేషన్, ఆలంకరణ అందుబాటులో ఉంచటం జరిగింది. వంట చేసే మాస్టర్ కూడ అందుబాటులో ఉన్నారు.

- దేవులపల్లి రాకేష్‌గౌడ్, రాజ్‌ఠాగూర్ గార్డెన్ మేనేజర్, హిమాయత్‌నగర్, మొయినాబాద్

ఫంక్షన్ హాళ్ల బుకింగ్ జోరు

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండటంతో ఫంక్షన్‌హాల్స్ బుకింగ్ జోరుగా కొనసాగుతోంది. నగర శివారులో రికార్డు స్థాయిలో ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలు తమ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఫంక్షన్ హాల్స్ బుక్ చేసుకుంటున్నారు. ఆర్థికంగా ఉన్న వాళ్లు మాత్రం అందుకనుగుణంగా పెళ్లిళ్లు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పెద్ద పెద్ద కన్వెన్షన్లు బుక్ చేసుకుంటున్నారు. వీటి అద్దె లక్షల్లోనే ఉంటున్నా.. ఏమాత్రం వెనుకాడడం లేదు.

కుల గణనను వెంటనే ప్రారంభించాలి

బీసీ సంక్షేమానికి ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాలి

- బీసీ ఉద్యమంలో వికారాబాద్ జిల్లా అగ్రస్థానంలో ఉండాలి
- భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వికారాబాద్, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించి తమ హామీని నిలబెట్టుకోవాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఐక్య వేదిక, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో బుధవారం వికారాబాద్‌లోని నర్సింగ్ గౌలీకార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే బీసీ సంక్షేమానికి ప్రతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఏటా రూ.20 వేల కోట్ల వంతున ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్... తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కులగణన వెంటనే చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. జీవాల లెక్కింపు చేస్తున్న ప్రభుత్వం ...మనుషులు ఎంత మంది ఉన్నారనేది గుర్తించేందుకు కులగణన చేపట్టేందుకు ఎందుకు ఆలోచిస్తోందని ప్రశ్నించారు. బీసీల హక్కులకు ప్రతీకగా భావించే మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని వచ్చే ఏప్రిల్ 11వ తేదీలోగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసేలా సానుకూల ప్రకటన చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అదే నెల 12వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. బీసీలకు బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించేలా, అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేసేలా, కులగణన వెంటనే చేపట్టేలా వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, సీఎం రేవంత్‌రెడ్డిపై బీసీలు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీసీల కోసం చేపట్టిన ఉద్యమానికి వికారాబాద్ జిల్లా నాంది కావాలని, ఉద్యమంలో జిల్లా అగ్రస్థానంలో ఉండాలని అన్నారు. ముస్లిం మంత్రి లేని కేబినెట్ ఇప్పుడు రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచంద్రరావు మాట్లాడుతూ, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా బీసీలను ఐక్యం చేసి హక్కులను సాధించుకునేందుకే యుపీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. ఈ సందర్భంగా బీసీ, కుల సంఘాల ప్రతినిధులు తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూపీఎఫ్ కో కన్వీనర్ శివశంకర్, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ మాజీ చైర్మన్ జి.నాగేందర్‌గౌడ్, ఎంబీసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, పరిగి మునిసిపల్ చైర్మన్ ముకుంద అశోక్, నాయకులు దత్తాత్రేయ, కోల శ్రీనివాస్, నరేష్, రాజుగౌడ్, బిక్షపతి, బీఆర్ శేఖర్, వెంకటేశం, గోపాల్, రవికుమార్, ఉమాశేఖర్, శ్రీనివాసాచారి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉంటే సమావేశానికి ముందు ఎమ్మెల్సీ కవిత మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఇంటికి వెళ్లగా పార్టీ నాయకులు స్వాగతం పలికారు. పార్టీ నాయకులను పరిచయం చేశారు.

వీవీ ప్యాట్ల పరిశీలన క్షుణ్ణంగా చేపట్టాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్,ఫిబ్రవరి7: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వీవీప్యాట్ల మొదటి స్థాయి పరిశీలన క్షుణ్ణంగా చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో విజయ్‌కుమారిలతో కలిసి వికారాబాద్ మార్కెట్ యార్డులోని ఈవీఎం స్ట్రాంగ్ రూములను సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈవీఎంల మొదటి విడత పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14 వరకు మొదటివిడత పరిశీలన నిర్వహించడం జరుగుతుందని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్‌కు చెందిన 12 మంది సాంకేతిక నిపుణుల బృందం ఈవీఎంల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి
- జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి



మాట్లాడుతున్న శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 7: ఘట్‌కేసర్ మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతానని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జడ్పీ చైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారులు అక్రమాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. జడ్పీ నిధుల నుంచి మండలంలోని అయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం దాదాపు రూ. 4 కోట్లను మంజురు చేసినట్లు గుర్తుచేశారు. రాబోవు ఎండాకాలం దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండాచర్యలు తీసుకోవాలని మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, ఎంపీడీవో అరుణారెడ్డి, ఎంపీవో నందకిశోర్, ఎంపీటీసీలు కందుల సరళాకుమార్, కొమ్మిడి శోభారాణి, గట్టగల్ల రవి, నీరుడి రామారావు, మలిపెద్ది వెంకట్రామిరెడ్డి, బొడ్డు వినోద, కో-అప్షన్ సభ్యుడు ఎండీ ఇక్బాల్ పాల్గొన్నారు.

ఈ సారైనా..



- నిధుల కేటాయింపులో జిల్లాకు పెద్ద పీట వేసేనా?
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- అసెంబ్లీ స్పీకర్, సీఎంపై ప్రజల్లో కొండంత ఆశలు
- వికారాబాద్ జిల్లా ప్రజల్లో ఉత్కంఠ

వికారాబాద్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. గురువారం ప్రారంభం కానున్న ఈ సమావేశాలపై వికారాబాద్ జిల్లా ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. జిల్లాలోని నలుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీ వారే కావడం, జిల్లా నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో బడ్జెట్‌లో జిల్లా పరంగా నిధుల కేటాయింపు ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. నిధులు కేటాయింపుతో పాటు జిల్లా అభివృద్ధికి దోహదపడే కొత్త ప్రాజెక్టులు ఏవైనా మంజూరు చేస్తారా అనేది జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. వికారాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటక, ఉపాధి రంగాల పరంగా జిల్లాకు ఏ విధమైన కేటాయింపులు ఉండనున్నాయోనన్న చర్చ కొనసాగుతోంది.

అనంతగిరికి పర్యాటకానికి ముందడుగు పడేనా?

వారాంతాలు, సెలవు రోజుల్లో అనంతగిరి కొండలు, కోట్‌పల్లి ప్రాజెక్టును వేలాది మంది సందర్శకులు సందర్శిస్తుంటారు. కోట్‌పల్లి ప్రాజెక్టును మరో లక్నవరంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నా ఆ దిశగా రాష్ట్ర పర్యాటక శాఖ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జిల్లాకు మణిహారంగా భావించే అనంతగిరి కొండలు, కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఇంతకు ముందు జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన దివ్యా దేవరాజన్, సయ్యద్ ఒమర్‌జలీల్, ఆయేషా మస్రత్‌ఖానమ్, పౌసుమిబసు, ప్రస్తుత కలెక్టర్ నారాయణరెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. జంగిల్ రిసార్ట్స్, అడ్వంచర్‌పార్క్, ఎకో టూరిజం వంటి నిర్మాణాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. అనంతగిరిని పర్యాటక పరంగా ఎంతో అభివృద్ధి పరిచేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా ఇంత వరకూ ఆశించిన స్థాయిలో ముందడుగు పడకపోవడం గమనార్హం.

కొడంగల్ నియోజకవర్గానికి పెద్దపీట?

ఇదిలా ఉంటే.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గానికి ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసే అవకాశం ఉందని తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ (కడా) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంపొందించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కడాకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది.

కల సాకారమయ్యేనా ?

జిల్లాలో అన్ని రకాల ఉన్నత విద్యలు ఒకే గొడుగు కిందకు వచ్చేలా గ్రామీణ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. సీఎం రేవంత్ రెడిడ్డ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా ఇటీవల ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన విషయం తెలిసిందే. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, తాండూరులో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. అంతే కాకుండా కేంద్రీయ, నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని గత ఏడేళ్లుగా గత ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లిన విషయం తెలిసిందే. వికారాబాద్, పరిగిలో కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసినా స్వంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే, జిల్లా మీదుగా రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడితే రవాణా సదుపాయం మెరుగై కొత్త పరిశ్రమలు రావడానికి అవకాశం ఉంటుందని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడడమే కాకుండా అన్ని విధాలుగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందని జిల్లా ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల దశ మారేనా ?

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేస్తారని రైతులు కొండంత ఆశతో ఉన్నారు.ఐదేళ్లుగా చిన్న, మధ్యతరహా ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు కేటాయింపులు జరగలేదు. ప్రాణహిత - చేవెళ్ల, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేసినా ఆ రెండు పథకాలు మధ్యలోనే ఆగిపోయాయి. బోరుబావులనే నమ్ముకుని రైతులు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో ప్రాజెక్టులకు, చెరువులకు సరైన మరమ్మతులు లేక, కాల్వలు శిథిలావస్థకు చేరాయి. పిల్ల కాల్వలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి గేట్‌వాల్వ్‌లు కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు. సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు, ఆధునీకరణ చేపట్టి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిధులు కేటాయిస్తే జుంటుపల్లి, నవాంధ్ది ఎత్తిపోతల పథకం, శివసాగర్ పనులు ముందుకు సాగుతాయి.

సేవాలాల్ ఉత్సవాలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రామునాయక్

బషీరాబాద్, ఫిబ్రవరి 7: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని బంజార సంఘం నాయకులు జయప్రదం చేయాలని బంజార సంఘం, సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షుడు రాము అన్నారు. బషీరాబాద్ రైతు వేదికలో సమావేశమయ్యారు. ఈ నెల 15న జయంతిన బషీరాబాద్‌లో ప్రతిష్ఠించే సేవాలాల్ విగ్రహావిష్కరణ కార్యక్రమంపై బంజారా నాయకులతో చర్చించారు. విగ్రహావిష్కరణకు తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి, ముఖ్య నేతలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కమిటీ వైస్‌ప్రెసిడెంట్ బన్సీలాల్, నరేష్‌చౌహాన్, శివనాయక్, సూర్యనాయక్, యువకులు పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


కవితతో బషీరాబాద్ నాయకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 7: మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం వికారాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిశారు. బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ఆమెను జడల అనంతయ్య, మాధుసూదన్‌గౌడ్ తదితరులు కలిసి ముచ్చటించారు. బీసీ రిజర్వేషన్, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయమై దృష్టి సారించాలని ఎమ్మెల్సీని కోరారు.

రైల్వే అండర్‌పాస్ పనులు పూర్తి చేయాలి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విక్రమ్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7: మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీల్లో అసంపూర్తిగా ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి పనులను త్వరగా పూర్తిచేయాలని కోరుతూ బుధవారం మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పి.విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నాయకులు కేంద్ర మంత్రి, దక్షిణ మధ్య రైల్వే జీఎం ఆరుణ్‌కుమార్‌లను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పనులు ప్రారంభించి నాలుగేళ్లవుతున్నా పనులు పూర్తికాక రెండు మున్సిపాలిటీల, 8 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు వారికి వివరించారు.

'మూసిన రైల్వే గేటును వెంటనే తెరవాలి'

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7: రైల్వే అండర్‌పాస్ నిర్మాణం కోసం గౌడవెల్లిలో మూసిన రైల్వే గేటును వెంటనే తెరవాలని గ్రామస్థులు తహసీల్దార్ శైలజను కోరారు. ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ బుధవారం గ్రామాన్ని సందర్శించారు. రైల్వే గేట్‌ను మూయడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. నిర్మాణ సమయంలో ప్రత్యామ్నాయ దారిని చూపేవరకు గేట్‌ను కొనసాగించాలన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని తహసీల్దార్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.

వాహనాలకు నెంబర్‌ప్లేట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 7 : వాహనాలకు నెంబర్ ప్లేట్, రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. షాద్‌నగర్ శివారులోని పలు కూడళ్ల వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్‌ప్లేట్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కోర్టుకు పంపడం జరుగుతుందని చెప్పారు. తనిఖీ సందర్భంగా ఏడు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. వాహనం కొనుగోలు చేసిన నెల రోజుల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

ఎల్డీఎమ్‌తో గొప్ప నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహేశ్వరం, ఫిబ్రవరి 7 : లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్డీఎమ్) బలమైన నాయకత్వాన్ని తయారు చేస్తున్నదని, దీని వల్ల సమాజానికి ఎంతో మంది గొప్ప నాయకులను కాంగ్రెస్ పార్టీ అందిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ డిపార్టమెంట్ జాతీయ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎల్‌డీఎమ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్డీఎమ్‌లో నేర్చుకున్న విషయాలను తప్పక ఆచరణలో పెట్టాలన్నారు. ఎల్‌డిఎమ్ మిషన్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసినందుకు పార్టీ అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలిపారు. మహేశ్వరంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని, పార్టీలో గ్రూపుతగాదాలకు స్వస్తి పలికి కలిసికట్టుగా ఉండాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐల బదిలీ

యాచారం, ఫిబ్రవరి 7 : రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలో 34 మంది సీఐలను బుధవారం సాయంత్రం బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎన్.శంకర్‌కుమార్‌ను యాచారం ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. యాచారం సీఐగా పనిచేస్తున్న సైదయ్యను అబ్దుల్లాపూర్‌మెట్ స్టేషన్‌కు బదిలీ చేశారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా పనిచేస్తున్న ఎల్.రామాంజనేయులును స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న జి.నాగరాజును హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐగా నియమించారు.

ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

యాచారం, ఫిబ్రవరి 7 : ప్రతి ఉపాధి కూలీకి చేతినిండా పని కల్పించి ఆదుకుంటామని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం యాచారం మండల కేంద్రంలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి వారం వేతనాలు తమ ఖాతాలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని కూలీలు ఎంపీడీవోను కోరారు. వర్షం నీరు భూగర్భంలోకి ఇంకున్నట్లు సరిహద్దు కందకాలు తవ్వాలన్నారు. కూలీలు పనులు చేస్తున్న చోట తాగు నీరు అందుబాటులో ఉండేట్లు చూడాలని ఉపాధిహామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. వరద నీరు వృధాగా పోకుండ సరిహద్దు కందకాలు తవ్వాలని కూలీలకు చెప్పారు. ఎండలు ముదురుతుండడంతో టెంట్లు వేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ జంగయ్యకు సూచించారు.

కేంద్రానికి అప్పగిస్తే పోరాటమే

- మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 7 : కృష్ణ ప్రాజెక్టులను కెఆర్‌ఎంబికి అప్పగిస్తే ప్రజలతో కలిసి పోరాటం చేయడానికి బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఆపార్టీ నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకే మాజీ సీఎం కేసీఆర్ పది సంవత్సరాల పాటు పనిచేశారని, కృష్ణ బోర్డు నుంచి రాష్ట్రానికి రావాలసిన నీటి వాటా కోసం సుప్రీం కోర్టుకు వెల్లారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కృష్ణ బోర్డు ట్రిబినల్ నిర్ణయాన్ని వినకుండానే కేఆర్‌ఎంబీకి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. దీంతో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం జిల్లాలు కృష్ణనీటిపై హక్కులు కోల్పోతాయని చెప్పారు. దీనికి నిరసనగా ఈనెల 13న బీఆర్‌ఎస్ తలపెట్టిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో రంగారెడ్డి జిల్లా కందుకూరులో మంజూరు చేసిన మెడికల్ కళాశాలకు, ఆస్పత్రికి నిధులు కేటాయించామని, ఇక్కడ ఆస్పత్రి లేదని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. ఇక్కడ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని నిర్మిస్తే, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా వాసులకు ఎంతో మేలు జరుగుతందన్నారు. అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి హామీలను విస్మరిస్తున్నారని ఆరోపించాంచారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని చెప్పారు. జడ్పీటీసీ జంగారెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో కలిసి పనిచేసిన వారు రానిస్తారు

పదవుల్లో ఉన్నప్పుడు ప్రజలతో కలిసి పనిచేసే వారు రాజకీయాల్లో రానిస్తారని, ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధికి పోటీ పడి పనిచేసిన ఘనత తాజా మాజీ సర్పంచ్‌లకే దక్కుతుందని జడ్పీఛైర్ పర్సన్ తీగల అనీతారెడ్డి, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో తాజా మాజీ సర్పంచ్‌లక ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లె ప్రగతిని విజయవంతం చేయడానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు బాగా పనిచేశారన్నారు. సర్పంచ్‌లు ఆత్మసైర్యంతో ప్రజల కోసం పనిచేసినట్లు చెప్పారు. రెండు సంవత్సరాలు కరోనా వల్ల భయాందోళనతో పనిచేసినప్పటికి, మిగతా మూడు సంవత్సరాలు ప్రజలకు అనేక సేవాకార్యక్రమాలు చేపట్టినందుకు వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు వారి అనుభవాలను పంచకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, వైస్ ఎంపీపీ గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం ఛైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీడీవో వెంకట్రాములు, మాజీ ఎంపీపీ జె.పెద్దరామయ్య, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్ రాజశేఖర్ రెడ్డి, నాయకులు మన్నె జయేందర్, కాకి ధశరథ, బి.వెంకటేష్, మేఘనాథ్‌రెడ్డి, కె.సధానంద్‌గౌడ్, పాండుగౌడ్,రాజు, ధామోదర్‌గౌడ్, ఎంపీటీసీలు కాకి రాములు, ఎల్మటి లక్ష్మి, టి.ఇందిరదేవేందర్, పాల్గొన్నారు.



తాజా మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న జడ్పీచైర్ పర్సన్ తీగల అనీతారెడ్డి ఎమ్మెల్యే పి సబితాఇంద్రారెడ్డి

డీన్ అవమానించాడని విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- కళాశాల భవనంపై నుంచి దూకిన విద్యార్థి
- తీవ్ర గాయాలు.. నీలిమా ఆసుపత్రిలో చికిత్స



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్ఞానేశ్వర్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 7 : చదువు రాదని.. డీన్ అవమానపరచడంతో మనస్తాపానికి గురైన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలోని అనురాగ్ యూనివర్శిటీలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్శిటీలో సిద్దిపేట జిల్లా, చిన్న కోదూర్ మండలం, చంద్లాపూర్ గ్రామానికి చెందిన నక్కిరెడ్డి తిరుపతిరెడ్డి చిన్న కుమారుడు జ్ఞానేశ్వర్‌రెడ్డి సీఎస్‌సీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. నాలుగురోజుల క్రితం సీఎస్‌సీ మొదటి సెమిస్టర్ ఫలితాలల్లో నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. అప్పటి నుంచి డీన్ వీ.శ్రీనివాస్‌రావు(వీఎస్ రావు), పీటీలు కలిసి జ్ఞానేశ్వర్‌రెడ్డిని హేళన చేస్తూ ఇబ్బందులకు గురిచేశారని అతని కుటుంబీకులు ఆరోపించారు. విద్యార్థులందరి ముందు కొట్టడం, క్రమశిక్షణ లేకుండా హేయిర్‌కట్ చేసుకోకుండా కళాశాలకు ఎందుకువస్తున్నావని క్లాసురూంలో నిలబెట్టి అవమానపరిచేవారని చెప్పారు. డీన్, పీటీలు చేస్తున్న అవమానం తట్టుకోలేక బుధవారం కళాశాలలోని సీ బ్లాక్ రెండో అంతస్తుపై నుంచి దూకి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. సమాచారం బయటకు రాకుండా యూనివర్సిటీ యాజమాన్యానికి సంబంధించిన నీలిమా ఆసుపత్రిలోనే చికిత్స అందించారని ఆరోపించారు. డీన్, పీటీలపై విద్యార్థి తల్లిందండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజువర్మ తెలిపారు.

ఎవరినీ అమమానపరచలేదు : వీ. శ్రీనివాస్‌రావు, డీన్ అనురాగ్ యూనివర్సిటీ

జ్ఞానేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అనురాగ్ యూనివర్సిటీ డీన్ వీ శ్రీనివాస్‌రావు(వీఎస్ రావు) తెలిపారు. నాలుగు రోజులుగా అతను సమయానికి కళాశాలకు రావడం లేదని, ఎవరితో మాట్లాడకుండా మౌనంగా ఉంటున్న విషయాన్ని అతని తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించాం. హేయిర్ కట్ చేసుకోమని చెప్పిన మాట వాస్తవం, దానికి అతను నేను దేవుడికి జుట్టు వదిలేశామని చెప్పడంతో అప్పటి నుంచి ఆ విషయం అడగలేదని వీఎస్ రావు అన్నారు. క్రమశిక్షణతో ఉండాలని, శ్రద్ధగా చదువుకోవాలని అందరు విద్యార్థులకు చెప్పినట్లుగానే అతనికి కూడా చెప్పామని, ఎవరిని అవమానపరచడం గాని హేళన చేయలేదని తెలిపారు.

తాతపై బెంగతో యువకుడి ఆత్మహత్య



ప్రభాకర్(ఫైల్)

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 7: తన తాతపై బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజవర్గంలోని బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మండల పరిధి నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతకింద ప్రభాకర్(22) తండ్రి ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న అతని తాత గత నెల 9న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రభాకర్ బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి చింతకింద వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్‌రవూఫ్ తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ బహిరంగ సభ



హుసేన్‌పూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కొడంగల్, ఫిబ్రవరి 7 : ఉపాధిహామీ పథకంలో జరిగినపనులకు గ్రామాల్లో సామాజిక తనిఖీ పూర్తి కావడంతో ఈ నెల 9న కొడంగల్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బహిరంగసభలో వివరాలను వెల్లడించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. కొడంగల్ మండలంలో ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు జరిగిన పనులకు సంబందించి .రూ.10,0385899 ఖర్చు చేశారు. ఈ పనులపై ఈ నెల 1 నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీలో భాగంగా గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు 12 విడతలుగా సామాజిక తనిఖీ జరగగా 13వ విడత సామాజిక తనిఖీకి అధికారులు సిద్ధమయ్యారు. మండలంలోని ఆలేడ్‌లో రూ.32,01,054, అంగడిరైచూర్‌లో రూ.69,25,114, అన్నారంలో రూ.31,19,074, అప్పాయిపల్లిలో రూ.44,16,045, భవనమ్మతండాలో రూ.18,72,681, బోయపల్లితండాలో రూ.21,39,346, చిన్ననందిగామలో రూ.41,95,586, చిట్లపల్లిలో రూ.55,43,178, హస్నాబాద్‌లో రూ.31,31,046, హుసేన్‌పూర్‌లో రూ.28,97,170, ఇందనూర్‌లో రూ.30,25,970, ఖాజఅహ్మద్‌పల్లిలో రూ.40,86,859, కస్తూర్‌పల్లిలో రూ.38,27,222, లక్ష్మీపల్లిలో రూ.54,61,390, నాగారంలో రూ.39,70,089, పలుగురాళ్లతండాలో రూ.29,06,909, పర్సాపూర్‌లో రూ.41,52,232 పెద్దనందిగామలో రూ.52,72,571, పోచమ్మతండాలో రూ.40,72,161, పాటిమీదిపల్లిలో రూ.29,70,234, ప్యాలమద్దిలో రూ.25,63,594, రావులపల్లిలో రూ.43,27,451, రుద్రారంలో రూ.48,61,469, సంగాయిపల్లిలో రూ.41,26,328, టేకుల్‌కోడ్‌లో రూ.42,40,191, ఉడిమేశ్వరంలో రూ.30,80,935 మొత్తం రూ.10,03,85,899కు సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

నులి పురుగుల నివారణకు మాత్రలు

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్

వికారాబాద్, ఫిబ్రవరి 7 : నులి పురుగుల నివారణ కోసం విద్యార్థులందరికీ మాత్రలు అందించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, కళాశాలలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 19లోగా జిల్లాలోని విద్యార్థులందరికీ 100 శాతం నివారణ మాత్రలు అందించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా కృషి చేయాలని చెప్పారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసు వారికి ప్రతి సంవత్సరం రెండుసార్లు మాత్రలు అందించడం జరుగుతోందని తెలిపారు. 2 సంవత్సరాల వయసు లోపు వారికి అరమాత్ర, 2నుంచి 19 సంవత్సరాల వయసు వారికి 1 మాత్ర అందిస్తారని తెలిపారు. మాత్ర వేసుకునే ముందు విద్యార్థులు భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు, అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఆశ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాల్వన్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి , జిల్లా సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, మెప్మా పీడీ రవికుమార్ , డీఐవో డాక్టర్ బుచ్చిబాబు, స్టాటిస్టికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండాలి



నిక్‌ను సన్మానిస్తున్న గోపాల్ రెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7 : జీవితంలో పైకి రావాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సత్తా ఉండాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కునే విధంగా విద్యార్థులు తమకు తాముగా తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్ నిక్ ఉనిజిక్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ పరిధిలోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ తన అంగ వైకల్యం గురించి విద్యార్థులకు వివరిస్తూ, తాను ఎదుర్కున్న ఇబ్బందులను సవాలుగా తీసుకుని ముందుకు సాగి తనకంటూ ఒక గుర్తింపు తీసుకొచ్చుకున్నానని తెలిపారు. కాళ్ళు, చేతులు లేకపోయిన నేడు ప్రపంచంలోని వికలాంగుల్లో , విద్యార్థుల్లో , జీవితంతో నిరాషతో జీవిస్తున్న వారిలో ఉత్సాహాన్ని నింపే మోటివేటర్‌గా గుర్తింపు పొందానని చెప్పారు. నిరాశ పడకుండా విద్యార్థులు ముందుకు సాగిననాడే వారు అనుకున్న లక్ష్యాన్ని ఛేదించగలరన్నారు. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి గోపాల్‌రెడ్డి నిక్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం కేంద్రానికి తాకట్టు

- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు, ఫిబ్రవరి 7 : తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం వద్ద తాకట్టు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర పరిధిలోకి ఇక్కడి ప్రాజెక్టులు వెళ్తే సాగునీరు దొరకడం కష్టమవుతుందన్నారు. సాగునీటి కోసం మాజీసీఎం కేసీఆర్ 10ఏళ్లపాటు తీవ్రంగా కష్టపడ్డారని, పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను 80శాతం పూర్తి చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. దాన్ని కనుమరుగు చేసి నారాయణపేట్ - కోడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ తెరమీదికి తెచ్చిందన్నారు. కృష్ణ బోర్డు చేతుల్లోకి శ్రీశైలం ప్రాజెక్టు వెళితే పాలమూరుకు నష్టం జరుగుతుందని చెప్పారు.

ఎమ్మెల్యే చెంచాల మాటలు వినొద్దు

ఎమ్మెల్యే చెంచాల మాటలు నమ్మొద్దని రోహిత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి పనులకు తెచ్చిన ప్రొసిడింగ్ నకిలీవని ప్రచారం చేస్తున్నారని అవి నకిలీవని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాళు విసిరారు. తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్ దీపానర్సింహులు, కౌన్సిలర్ శోభారాణి, శ్రీనివాస్‌చారి, పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మహేశ్వరం, ఫిబ్రవరి 7 : ఎన్నికలముందు ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ హైదరాబాదు రీజియన్ కార్యదర్శి ఎస్. కృష్ణ అన్నారు. ఆర్టీసీ అభివృద్ధి ప్రజల ప్రయోజనాలు, కార్మికుల సంక్షేమానికి సంబందించిన రాష్ట్ర సదస్సు బుక్‌లెట్‌ను బుధవారం మహేశ్వరం ఆర్టీసీ డిపో ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీకి వస్తున్న ఆదాయలోటును ప్రభుత్వం చెల్లించాలన్నారు. మూడు నెలల డబ్బులను ముందుగానే ఆర్టీసీకి జమ చేయాలని కోరారు. ఆర్టీసీ విలీన ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని, ఆర్‌పీఎస్ 2013 ఆరియర్స్ కోసం ఇచ్చిన బాండ్ డబ్బులను చెల్లించాలన్నారు. 173 నెలల డిఏ బకాయిలను చెల్లించాలన్నారు. కార్మికులు పాల్గొన్నారు.

‘ప్రజాపాలన’ యాప్‌లో వివరాల సేకరణ

- క్షేత్ర స్థాయిలో పరిశీలన
- ఈ నెల 15 వరకు క్రాస్‌చెక్



యాప్‌లో వివరాలను పొందుపరుస్తున్న అధికారులు

తాండూరు, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో మరో రెండు గ్యారంటీల అమలుకు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కసరత్తును ప్రారంభించారు. గ్రామ, వార్డు స్థాయిలో అధికారులు పర్యటించి వివరాలను సేకరించాలని జిల్లా కలెక్టర్ మండల, మున్సిపాలిటీ స్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి ఈ నెల 10 వరకు రూ. 500కు గ్యాస్ సిలిండర్, 15 వరకు 200 యూనిట్ల లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రజా పాలన మొబైల్ యాప్ ద్వారా ఈ వివరాలను సేకరించాలని సూచించారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి పథకాలను ఈ నెలలో ప్రారంభించాలని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం విధితమే. రేషన్‌కార్డుల నంబర్‌లు సరిగా ఉన్నాయా, లేవా పరిశీలించడంతో పాటు, గ్యాస్ కనెక్షన్ వివరాలను సేకరించాలి. అధికారులు దరఖాస్తుదారుల నుంచి గ్యాస్ డిలివరీ రశీదు, పాస్ బుక్ పరిశీలించి యాప్‌లో ఎల్‌పీజి కంపెనీ పేరు, వినియోగదాడి నంబర్ నమోదు చేస్తున్నారు. రేషన్‌కార్డు నంబర్, గ్యాస్ కనెక్షన్ వివరాలలో తప్పులుంటే అప్‌లోడ్ చేసే సందర్భంలో ఫీల్డ్ వెరిఫికేషన్‌లో సరిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిరోజు పర్యవేక్షిస్తారు.

ప్రతీ గడపకు కేంద్రప్రభుత్వ పథకాలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

చేవెళ్ల, ఫిబ్రవరి 7: : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని మల్కాపూర్‌లో బీజేపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశం భాగుటుందని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి గడపకు తీసుకువెళ్లాలని చెప్పారు. భూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలని కోరారు. బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు ఆంజేయులు, దేవుని శర్వలింగం, హన్మంత్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, రవిందర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులు

- పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు
- టీచర్‌పై ఆదిభట్ల పీఎస్‌లో కేసు నమోదు

ఆదిభట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఓ విద్యార్థినిపై పీఈటీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్ క్యాంపస్‌లో జరిగింది. ఈమేరకు బుధవారం బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ స్కూల్లో చదివే విద్యార్థినిపై పీఈటీ ప్రకాశ్ కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు ఫోన్ చేసి మరీ వేధిస్తుండేవాడని బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాంతో విసిగిపోయిన అతడు బాలికపై లైంగిక, మానసిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపాడు. పీఈటీపై కేసు నమోదు చేసినట్లు ఆదిభట్ల పోలీసులు తెలిపారు. కాగా, ఆ స్కూల్‌పై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయి. గతంలో 6వ తరగతి చదివే ఓ విద్యార్థి అనారోగ్యంతో కిందపడిపోతే సకాలంలో ఆస్పత్రికి చేర్చకపోవడంతో ఆ విద్యార్థి చనిపోయాడు.

దైవ చింతనతో ఆనందమయ జీవనం

ఆమనగల్లు, ఫిబ్రవరి 7 : దైవ చింతనతో ముందుకు సాగే వారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమ జీవితాన్ని పొందుతారని, సమాజ శాంతి కోసం ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఊర్కొండ పేట అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని బుధవారం వరప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల అభివృద్ధికి, భక్తుల సదుపాయాల కల్పనకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని ఆయన సూచించారు. దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి, వ్యక్తి సన్మార్గ పురోగమనానికి దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, నాయకులు అనిల్ గౌడ్, అభినవ్ రెడ్డి, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రచ్చ శ్రీరాములు, చంద్రశేఖర్, సుఖజీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి



తాండూరు రూరల్: అంతారంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7: గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శ్రద్ధపెట్టి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ప్రత్యేకాధికారులు ఆదేశించారు. బుధవారం అంతారం, కరన్‌కోట్, సంగెంకలాన్, మల్కాపూర్, గోనూరు, నారాయణపూర్, వీరిశెట్టిపల్లి గ్రామాల్లో అధికారులు పారిశుధ్య పనులు చేయించారు. డ్రెయిన్లలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. పీఎస్‌లు గ్రామంలో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు తహసీల్దార్ తారాసింగ్, డీటీ విజయేందర్, ప్రణీత్, వెంకటయ్యగౌడ్, రజిత తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని సంగెంకలాన్ ప్రత్యేకాధికారి సాయి ప్రణీత్‌ను మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ సన్మానించారు. గ్రామంలో పారిశుధ్య పనుల్లో భాగంగా గ్రామానికి వెళ్లిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ప్రత్యేకాధికారి సాయిప్రణీత్‌లను గ్రామస్తులు సన్మానించారు. ప్రత్యేకాధికారిగా గ్రామంలో నాణ్యమైన సేవలందించాలని కోరారు.

వికారాబాద్: గ్రామాల్లో ఈ నెల 14వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని వికారాబాద్ ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి రోడ్లు, మురుగు కాల్వలు, నీటి ట్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేయిస్తామని చెప్పారు. నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్లను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. డిప్యూటీ సీఈవో సుభాషిణి, అధికారులు పాల్గొన్నారు.

బషీరాబాద్: గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ప్రత్యేకాధికారులు హాజరై వారం పాటు నిర్వహించే కార్యక్రమాలపై చర్చించారు. అంతర్గత రోడ్లు, డ్రెయిన్లను అధికారులు శుభ్రం చేయించారు.

మోమిన్‌పేట్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించాలని ప్రత్యేకాధికారి ప్రణీత్ అన్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. టేకులపల్లిలో ఏఈ ప్రణీత్, అమ్రాదికుర్దులో మనోహరచక్రవర్తి, ఎన్కతలలో ఎంపీడీవో శైలజారెడ్డి, వెల్చాల్‌లో ఎంపీవో యాదగిరి, పంచాయతీ కార్యదర్శులతో గ్రామసభలు నిర్వహించారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కులకచర్ల: గ్రామాల్లో సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తేవాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. లాల్‌సింగ్ తండా, రాంపూర్ పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వారం రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీటీసీ రాంలాల్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు. ముజాహిద్‌పూర్‌లో ఎంపీవో కరీం, చల్లాపూర్‌లో ఎంఈవో హబీబ్ అహ్మద్ గ్రామసభలు నిర్వహించి పనులపై చర్చించారు.

శామీర్‌పేట: గ్రామ పంచాతీయలకు నియమితులైన ప్రత్యేకాధికారులు బాధ్యతలను స్వీకరిస్తున్నారు. పొన్నాల్‌కు నియమితులైన ఏవో రమేశ్‌ను సన్మానించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, నీటి సరఫరా అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్యనారాయణగౌడ్, ప్రభాకర్, శివశంకర్, రాజు, రత్నం, పీఎస్ దేవేందర్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. మండలంలోని సంగాయిపల్లి గ్రామంలో కొడంగల్ తహసీల్దార్, ప్రత్యేకాధికారి బి.విజయ్‌కుమార్ గ్రామంలో సభ నిర్వహించారు. నర్సరీ, పాడుబడ్డ బావి, మురుగు నీటి కాల్వలను పరిశీలించారు. 15వ తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయన్ను రిటైర్డ్ హెచ్‌ఎం హన్మయ్య, గ్రామస్తులు సన్మానించారు.



వికారాబాద్: పులమద్దిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో సత్తయ్య



పొన్నాల్‌లో పంచాయతీ ప్రత్యేకాధికారి రమేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



కులకచర్ల: లాల్‌సింగ్ తండాలో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీధర్

మాజీ ఉప సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

● అక్రమ ప్రహరీ కూల్చివేతకు పూనుకోవడంతో ఉద్రిక్తత



ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న లావణ్య

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 7 : అక్రమంగా నిర్మించిన ప్రహరీని బుధవారం అధికారులు కూల్చివేతకు యత్నించగా కొల్తూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని సర్వే నంబర్ 184, 185లలోని ప్లాట్ నంబర్ 7లో పబ్లిక్ రోడ్డుకు అడ్డంగా మాజీ ఉప సర్పంచ్ లావణ్య ప్రహరీ నిర్మించారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ప్రహరీ కూల్చివేతకు నోటీసులిచ్చారు. అయినా ఇంటి ఓనర్లు స్పందించకపోవడంతో ప్రహరీ కూల్చివేతకు పంచాయతీ సిబ్బంది వెళ్లారు. గోడ కూల్చొద్దంటూ మాజీ సర్పంచ్ లావణ్య అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ గోడ కూల్చితే తాను పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని అన్నారు. దీంతో అధికారులు, గ్రామస్తులు లావణ్యను వారించారు. చివరకు ఆమెను 108 అంబులెన్స్‌లో సమీపంలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు.

సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



దోమ, ఫిబ్రవరి 7 : ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్లు అన్నారు. బుధవారం ప్రభుత్వాసుపత్రి ఆవరణలో సమ్మె పోస్టర్‌ను వారు విడుదల చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ.. ఆశాలకు పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వకుంటే ఈ 9న కలెక్టరేట్ ముట్టడి చేపడుతామన్నారు. ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆశాలు రమాదేవి, అతియ, బుడ్డమ్మ, సత్యమ్మ, యశోద, లక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెన్‌గోముల్ ఎస్‌గా మధుసూదన్‌రెడ్డి

పూడూరు, ఫిబ్రవరి 7 : చన్‌గోముల్ ఎస్‌ఐగా మధుసూదన్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ గిరి పెద్దేముల్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మధుసూదన్‌రెడ్డి వచ్చారు.

కరన్‌కోట్ ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7 : కరన్‌కోట్ ఎస్‌ఐగా విఠల్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై మధుసూదనరెడ్డి చన్‌గోముల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మోమిన్‌పేట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి బదిలీపై వచ్చారు.

బషీరాబాద్ ఎస్‌ఐగా రమేష్

బషీరాబాద్, ఫిబ్రవరి 7: బషీరాబాద్ ఎస్‌ఐగా రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ ధారూర్‌కు బదిలీ అయ్యారు.

బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్



గురుదోట్లలో కూలీలతో మాట్లాడుతున్న పాండుగౌడ్

ధారూరు, ఫిబ్రవరి 7: గురుదోట్లలో బీజేపీ నాయకులు బుధవారం గావ్ చలో అభియాన్‌ను నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి పాండుగౌడ్ ఆధ్వర్యంలో పర్యటించి రాత్రిబస చేశారు. ఉపాధ్యాయులు, రైతులు, ఉపాధి కూలీలు, సాధారణ ప్రజలను కలిశారు. మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పథకాలను వివరించారు. కేంద్రం పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, రేషన్ బియ్యం, పీఎం కిసాన్, ఉపాధి హామీ నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటూనే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పాండుగౌడ్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వైద్యనాథ్, గోపాల్, సురేష్, నరేష్, భవాని, శ్రీకాంత్, రాజు, శివ, నాగరాజ్, గిరి పాల్గొన్నారు.

మర్పల్లి: గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. దామస్తాపూర్‌లో ఆయన పర్యటించారు. గ్రామంలో సమస్యలపై ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి చెందాయని, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదన్నారు. పాఠశాలలలో ఒకే గదిలో మూడు తరగతుల నిర్వహిస్తున్నారని, మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, రామేశ్వర్, రఘుపతి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'గావ్ చలో'లో పాల్గొన్న మాజీ ఎంపీ



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: బీజేపీ నాయకులు గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు చెప్పే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బుధవారంరాత్రి పెద్దేముల్ మండలంతట్టెపల్లిలో మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బూతుస్థాయి కార్యకర్తలతో సమావేశమయ్యారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పల్లె నిద్ర చేపట్టారు. నాయకులు యు.రమేష్, బంట్వారం భద్రేశ్వర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రజనీకాంత్ పాల్గొన్నారు.

'గృహజ్యోతి'పై ట్రాన్స్‌కో ఉన్నతాధికారుల తనిఖీ



ధారూరులో వివరాలు సేకరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

ధారూరు, ఫిబ్రవరి 7:గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు స్కీమ్ వర్తింపజేసేందుకు ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది బిల్లింగ్‌ను బుధవారం తనిఖీ చేశారు. ధారూరులో ట్రాన్స్‌కో డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ సుధామాధురి, ఎస్‌ఈ జయరాజ్, ఎస్ఏవో శ్రీనివాస్, ఏవో శ్రీనాథ్‌రెడ్డి, ఏడీఈ సత్యనారాయణరెడ్డి వినియోగదారులతో మాట్లాడారు. విద్యుత్ బిల్లులు, రీడింగ్‌లను పరిశీలించారు. గృహజ్యోతి పథ కంపై వివరించారు. వినియోగదారులు రేషన్/ఆధార్ కార్డుల వివ రాలు, లింక్డ్ మొబైల్ నంబర్లు ఇవ్వాలని సూచించారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఏవో లక్ష్మయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: గృహజ్యోతి పథకానికి వివరాలు నమోదు కోసం ఇంటికి వచ్చే విద్యుత్ సిబ్బందికి వివరాలను అందజేయాలని ట్రాన్స్‌కో ఏఈ పూర్ణచందర్‌రావు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఎవరైనా దరఖాస్తు చేసేకోకున్నా తెల్ల రేషన్/ఆధార్ కార్డుల వివరాలు ఇవ్వాలని సూచించారు. అద్దెకుండే వారికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే సుమన్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



ధారూరులో సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ధారూరు/ ఫిబ్రవరి 7: సీఎం రేవంత్‌రెడ్డిని తూలనాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్టపర చర్యలు తీసుకోవాలని బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు సీఐ రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని సుమన్ దుర్భాషలాడుతూ చెప్పు చూపించి అవమానించాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమన్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాన్‌సింగ్, హరిచంద్, బల్వంతరెడ్డి, రాజేందర్, బాబ ఖాన్, యాదయ్య, తిరుపతయ్య, ముజప్పర్, రాజేశ్వర్, ఇబ్రహీం, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

దోమ: సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలని బొంపల్లి కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. పరిగి-మహబూబ్‌నగర్ రోడ్డుపై సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.బాల్‌రాజ్, రమేశ్, బషీర్, ప్రభాకర్, రాములు, చంద్రశేఖర్, కలీం పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలపై తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు మాట్లాడుతూ అధికారం కోల్పోవడంతో బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించిందన్నారు. ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ, మశ్చేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, దేవేందర్, శశిధరన్, మల్లేష్, వీరేందర్, సాయిచరణ్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఫారూక్, కౌన్సిలర్లు మల్లేష్, కుతాడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ నాయకుడు సురేశ్ డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పట్లూర్‌లో అతడి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎంపై ఒక మాజీ ఎమ్మెల్యే ఇలా అనుచితంగా మాట్లాడడం అతడి అవివేకాన్ని తెలియజేస్తోందన్నారు. సుమన్‌కు త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



మర్పల్లి మండలం పట్లూర్‌లో సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



కులకచర్ల, ఫిబ్రవరి 7 : పరిగి బ్లాక్-బి కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం కస్తూర్బాగాంధీ పాఠశాల టెన్త్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌దేవి, నాయకులు వెంకటయ్య, నర్సింలు, ఎల్లయ్య, బాబు, లాలూ పాల్గొన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డిని కలిసిన వజ్రేష్



కీసర, ఫిబ్రవరి 7 : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బుధవారం పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మేడ్చల్ జిల్లాలో రోడ్లకు, మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. ప్రతిపాదనలు అందజేశారు. తన వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారని వజ్రేష్ తెలిపారు.

అనుమతులున్న చోటే ఇసుక డంప్ చేయాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 7 : ట్రాక్టర్ యజమానులు అనుమతులు పొందిన చోటే ఇసుకను డంప్ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని పట్టణ సీఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఖంజాపూర్‌లో ఇసుక తరలిస్తున్న వారితో మాట్లాడారు. ఇసుక తవ్వకాలకు రెవెన్యూ అనుమతులు తప్పక తీసుకోవాలని సూచించారు. ప్రతీ ట్రాక్టర్ డ్రైవర్ వద్ద లైసెన్స్, అనుమతి పత్రాలు ఉంచుకోవాలన్నారు. సమయం దాటిన తర్వాత ఇసుక తరలించొద్దన్నారు.

ఈఎస్‌ఐ సేవలను వినియోగించుకోవాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 7: కార్మిక బీమా సంస్థ అందిస్తున్న సౌకర్యాలను ఈఎస్ఐ కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శరత్ అన్నారు. బుధవారం మొరంగపల్లి శివారులో గల వోల్టా గ్రీన్ కంపెనీలో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి జయరాజ్, ప్లాంట్ హెచ్ఆర్ శివరామకృష్ణ, సురేందర్, శివ, రాజీరెడ్డి, మహేంద్ర, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 7: దుద్యాలలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. హెచ్‌ఎంగా రాఘవేందర్, ఎంఈవో మదస్సిర్, డీఈవో రమేశ్, పీఈటీ శ్రీనాథ్‌గౌడ్, మరో 13 మంది టీచర్లుగా వ్యవహరించారు. కరస్పాండెంట్ పి.రాఘవేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, మనిషి క్రమశిక్షణే జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందించారు. కార్యక్రమంలో శ్వేత, రఘు, శ్రీనివాస్‌గౌడ్, జయశ్రీ, అన్వర్, సాగరిక పాల్గొన్నారు.



దుద్యాలలో స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థుల్లో నైపుణాన్ని వెలికితీస్తాం

పరిగి, ఫిబ్రవరి 7: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేలా బోధిస్తున్నామని హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిర్యానాయక్‌తండాలో బుధవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల చేయూత అభినందనీయం అన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ శమంత, టీచర్లు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కల్పించాలి

పరిగి, ఫిబ్రవరి 7: సైన్స్‌పై పాఠ్యాంశాలపై ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు వివరించాలని ఎంఈవో హరిశ్చందర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సైన్స్, గణిత సబ్జెక్టుల్లో శ్రద్ధ పెట్టాలన్నారు. హెచ్‌ఎం గోపాల్, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **వికారాబాద్:** తెలంగాణ ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్‌గా నవాబుపేట మండలానికి చెందిన తెలుగు రాఘవేందర్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని సొసైటీ కార్యాలయంలో సొసైటీ వ్యవస్థాపకులు పిట్టల రవీందర్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల కన్వీనర్లు రామన్న, మహేష్, మన్నె వెంకటేశ్ పాల్గొన్నారు.

● **యాలాల** : రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మునీరొద్దీన్ పేర్కొన్నారు. యాలాలలో గ్రామసభను నిర్వహించారు. మురుగు కాలువలను ఎప్పటిప్పుడు శుభ్రం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంజయ్యగౌడ్, అక్బర్‌బాబ, రాజేందర్‌రెడ్డి, రాములు,శేఖర్, మోహిజ్, శేఖర్, హైమద్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

● **పరిగి:** ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం పరిగికి చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ మర్యాదపూర్వకగా కలిశారు. ఆయన షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌తో ఢిల్లీ వెళ్లారు. గత ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం పని చేసిన కార్యకర్తలను గుర్తించాలని సీఎంను కోరినట్లు తెలిపారు.

● **తాండూరు:** జాతీయ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన తాండూరు అక్షర పాఠశాల విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నర్సింలు, ఎంపీటీసీ విజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు** : భారత్ రైస్ పేరుతో కేంద్రం సన్న బియ్యం రూ.29లకే అందచేయడం హర్షనీయం అని కౌన్సిలర్ సాహశ్రీలత తెలిపారు. జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య, కేంద్రీయ బండారు విక్రయ కేంద్రాల్లో 5కిలోలు, 10 కిలోల ప్యాకెట్లలో లభ్యమవుతాయని పేర్కొన్నారు.

● **కీసర** : ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మెడిసిటీ అధ్వర్యంలో అంకిరెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు, వరి బీజం, బీజపుకుట్టు, గడ్డలు, కణతలు, థైరాయిడ్, గర్భసంచికి సంబంధించి సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ల నొప్పి సమస్యలపై పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 110 మందికి వైద్య పరీక్షలు చేయగా 22 మందిని ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కవితశశి, వైద్యులు జాహ్నవి, సుచిత్ర, సంతోష్, హారతి, మార్కెటింగ్ ఇన్‌చార్జి వెంకటాద్రి, సురేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **దోమ:** పదో తరగతి విద్యార్థులు రాబోయే వార్షిక పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని మండల ప్రత్యేకాధికారి కోటాజీ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. విద్యార్థులతో బోధనతో పాటు మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై హెచ్‌ంఎను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్** : బీఆర్ఎస్ నాయకుడు శివ వివాహం కరన్‌కోట్‌లో బుధవారం జరిగింది. ఈ పెళ్లికి మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించాడు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉమాశంకర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట** : తూంకుంట మున్సిపల్ ఉప్పరిపల్లి పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కీసర మండలం గోధుమకుంటకు చెందిన వంగేటి అంజిరెడ్డి-సుశీల దంపతులు, బుచ్చిరెడ్డి-లక్ష్మి దంపతులు, వారి మనుమలు వర్ధన్‌రెడ్డి, సాయికిరణ్‌రెడ్డి అన్నదానం చేపట్టారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

● **కీసర** :2024-2025 విద్యాసంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్ కూమార్ తెలిపారు. 1వ తరగతి డే స్కాలర్, 5వ తరగతి రెసిడెన్షియల్‌కు ఎస్సీ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఈ నెల 8నుంచి 26వ తేదీ వరకూ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

తాగు నీరు వృథా

పూడూరు: మండల పరిధి మేడికొండలో బోరు మోటారు వేయగానే నల్లాల నుంచి నీరు వృథాగా పోతోంది. ట్యాప్‌లు బిగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం కొడంగల్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ఖాజఅహ్మద్‌పల్లికి చెందిన గడ్డమీది చిన్నపకీరప్ప తన మోపెడ్(టీఎస్08 హెచ్ బీ0760)పై కొడంగల్‌కు వచ్చాడు. తిరిగి సొంత గ్రామానికి వెళ్తుండగా కొడంగల్ శివారులో సేడంకు వెళ్తున్న లారీ(ఎంహెచ్12 టీవీ3944) వెనక నుంచి అతడిని ఢీకొట్టింది. పకీరప్ప కాళ్లపై నుంచి లారీ టైర్లు వెళ్లడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలి

బంట్వారం, ఫిబ్రవరి 7: ఎవరైనా సెల్‌ఫోన్ పోతే సీఈఐఆర్ వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ ఆనంద్ అన్నారు. బుధవారం సుల్తాన్‌పూర్, నాగ్వారం గ్రామాలకు చెందిన వారికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ చేసి అందజేశారు. మొబైల్ ఫోన్ పోయినా, లేదా చోరీకి గురైనా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్లో నమోదు చేయాలని తెలిపారు. మొబైల్ ఎక్కడుంతో ట్రాక్ చేసి రికవరీ చేస్తామన్నారు. ఫిర్యాదులో ఫోన్ ఐఎంఈఐ నంబరు, ఆధార్ కార్డు, మీ సేవ ఆన్లైన్ సెంటర్లో కట్టిన రిసిప్ట్ జత చేయాలని వివరించారు.

బెదిరించిన బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 7 : తమను బెదిరించిన బీఆర్ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఓ వెబ్‌న్యూస్ విలేకరులు రవిచంద్ర, కిరణ్‌కుమార్ బుధవారం సీఐ గోవర్ధనగిరికి ఫిర్యాదు చేశారు. కిరణ్‌కుమార్‌కు పోచారం మునిసిపాలిటీ బీఆర్ఎస్ నాయకుడు గోవింద్ ఫోన్‌చేసి చంపేస్తానని బెదిరించి దూషించాడని వారు పేర్కొన్నారు. అన్నోజిగూడ సర్వేనంబరు 3/1లో గల ప్రభుత్వ భూమిలో ఆక్రమణలపై తాము వార్తలు రాయగా గోవింద్ బెదిరించాడని ఫిర్యాదులో తెలిపారు.

గ్యాస్ లీకై ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలు

బీసీ బాలికల హాస్టల్‌లో ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి..

యాలాల, ఫిబ్రవరి 7 : బీసీ బాలికల హాస్టల్‌లో గ్యాస్‌పైపు లీకై ముగ్గురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. యాలాలలోని బీసీ బాలికల హాస్టల్‌లో సోమవారం సాయంత్రం విద్యార్థినులకు వంట చేసేందుకు వంట మనుషులు వంట గదిలోకి వెళ్లారు. సిలిండర్‌లో గ్యాస్ అయిపోవడంతో రీఫిల్ సిలిండర్ పెట్టి రెగ్యులేటర్ ఆన్‌చేశారు. ఈ క్రమంలో పైప్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వంట మనుషులు అనిత, బసమ్మ, ఫర్హానా బేగం చేతులు, ముఖాలు కాలాయి. సమీపంలోని వారొచ్చి మంటలార్పడం తో ప్రాణగండం తప్పింది. ప్రమాద సమయంలో హాస్టల్‌లో విద్యార్థినులెవరూ లేరు. క్షతగాత్రులు తాండూరు ఆస్పత్రిలో కోలుకుంటున్నారని వార్డెన్ భాగ్యలక్ష్మి తెలిపారు. కాగా చికిత్స పొందుతున్న అనిత, బసమ్మ, ఫర్హానాలను బుధవారం జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, వెంకటేష్ పరామర్శించారు.

9వ తరగతి విద్యార్థి అదృశ్యం



అభిలాష్‌రెడ్డి

యాలాల, ఫిబ్రవరి 7 : మండలంలోని గౌతమి మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అభిలాష్‌రెడ్డి అనే విద్యార్థి అదృశ్యమయ్యాడని ఎస్ఐ శంకర్ బుధవారం తెలిపారు. అభిలాష్‌రెడ్డి హాస్టల్ ఉంటూ చదువుకుంటున్నాడని, బుధవారం ఉదయం నుంచి అతడు కన్పించడంచ లేదని ఫిర్యాదు అందిందన్నారు. ఎవరికైనా అబ్బాయి వివరాలు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.